# పేరులోనే పెన్నిధి

''వెంకటేశ్వర్లు ఇంటికివచ్చాడా?''

"రాలేదు ఇవాళ పొద్దున పేపరు చూసినప్పటినుంచీ మీరన్న మాటలకు స్నానం చేయకుండా వాకిట్లోనుంచే బయటికి వెళ్ళిపోయాడు. ఇప్పుడు నాలుగు గంటలయింది భోజనంలేదు-కాఫీలేదు" ఎర్రబడ్డ కళ్ళతో జవాబిచ్చింది కనకవల్లి.

"నేనేమన్నాననీ? చదువుమీద ధ్యానముంచి చదివితే పరీక్ష ప్యాసవుతారు గాని-ఆడుతూ పాడుతూ సినిమాలకువెళ్ళుతూ, ఎప్పుడైనా తీరిక దొరికినప్పుడు పుస్తకం చేతబట్టితే, పరీక్ష ప్యాసవుతారా? అయ్యేలక్షణాలు ఇట్లాగే ఉంటాయా?'' ఎగిరిపడ్డాడు భార్యమీద జయరాజ్.

''వాడు సరిగా చదువుకోలేదంటే నేను నమ్మను. గదిదాటి బైటికి వచ్చి ఎరుగడు కాలేజినుంచివచ్చి ఏ అరగంట సేపు స్నేహితులతో గడిపేవాడో-అంతే."

తల్లి వెంకటేశ్వర్ల పక్షం. ''బాగా చదివి పరీక్షరాశాడు గాని ఎక్కడో పొరబాటు జరిగి ఉంటుంది. దానికి అబ్బాయిని అని ఏంలాభం?'' అంటుంది కనకవల్లి.

''వాడి చదవటాన్ని నీవు మెచ్చుకోవలసిందే. తోటివాళ్ళంతా ఎట్లాకష్టపడి చదివారో నేను చూడటంలేదూ? వాడికిడబ్బిచ్చి చెడగొట్టావు.'' జయరాజ్ మండి పడుతున్నాడు.

''కాలేజిలో చదివేవాడికి సంవత్సరానికి ఐదువేల రూపాయల ట్యూషను, కాలేజి ఫీజు, పుస్తకాలు, కాలేజిలో చదువుతున్నాడని సూట్లూ బూట్లూ పాకెట్ మనీ. అంతాకలిపి తడిసి మోపెడయింది.''

''పిల్లలకు భోజనం పెట్టటానికీ మీకులెక్కే. బట్టలుకుట్టించటానికీ లెక్కే అన్నిటికీ ఇలా లెక్కలు పెట్టుకునే తండ్రిని మిమ్మల్నే చూస్తున్నాను."

ఇద్దరిమధ్యా మాటామాటా పెరుగుతోంది.

"నాన్నా నాలుగుగంటలయింది ఇప్పటివరకూ అన్నయ్య రాలేదంటే వెతకటానికి ఎవరినయినా పంపించరేం? అన్నయ్య స్నేహితుడు రోహిత్ ఇంట్లో ఉన్నాడేమో? ఎవరినయినా పంపించండి. అక్కడలేకపోతే జ్ఞానేశ్వర్ ఇంట్లో ఉన్నాడేమో! అన్నయ్యకోసం వెతికించకుండా మీ రిద్దరూ వాదించుకుంటూ కూర్చుంటే తెల్లవారుతుంది. ఇప్పుడు ఐదుగంటలయింది."

లీలకు వంటచేతకాకపోయినా కుక్కర్ పొయ్యిమీది కెక్కించింది.

రాత్రికి వంటప్రయత్నం చేయకుండా కనకవల్లి దిగాలుపడి గోడకానుకుని కూర్చుంది. జయరాజ్ వరెండాలో అటూ ఇటూ తిరుగుతూ మధ్య మధ్య ఏవో మాటలంటున్నాడు. ఆమెకూడా ఊరుకోవటంలేదు ఏవో జవాబులిస్తునేఉంది.

వాళ్ళమాటలు అలా సాగుతునే ఉంటాయని నౌకర్లను వెతకటానికి పంపించింది లీల.

రాత్రి తొమ్మిది గంటలయింది. జయ్‌రాజ్‌కి పైపైన వచ్చినకోపం కొంచెం శాంతించి ఆలోచన మొదలైంది.

ఏమయినాడు వెంకటేశ్వర్లు? ఉదయంనుంచి ఇంతసేపు ఎక్కడికి వెళ్ళి ఉంటాడు?

ఈ కాలంపిల్లలు వాళ్ళ చేసేపనులు ఎట్లాఉన్నా ఒక్క మాటంటే సహించరు. చిన్నప్పుడు తను ఎన్నిదెబ్బలుతిన్నాడో? తన దగ్గర తప్పున్నదని ఎన్నిమాటలన్నా పడేవాడు అందుకే తనకు చదువువచ్చింది

ఇప్పటి కుర్రకారు మాటపడరు.

"ఒకవేళ పరీక్షపోయిందని నేనన్న మాటలకు ఏకాలవలోనోపడి ఆత్మ హత్య చేసుకోలేదుగద?"

జయరాజ్ బుజమ్మీదఉన్న తువాల కిందపడేసి షర్టువేసుకుని బైటికి వెళ్ళాడు టార్చి చేతబట్టుకుని.

కనకవల్లి పొరుగింటికివెళ్ళి "పిన్నిగారూ మా అబ్బాయి కనబడటంలేదు

పొద్దుటనుంచీ మీ శేషు దగ్గరికేమయినా వచ్చాడా?" నీరసంతో కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళింది.

"రాలేదమ్మా మావాడు ఇంట్లోనేఉన్నాడు "అన్నది.

కనకవల్లి ఇంటికి వచ్చేసరికి వెతకటానికివెళ్ళిన నౌకర్లిద్దరూవచ్చారు అబ్బాయిగారు కనబడలేదంటూ.

"లాంతరుపట్టుకుని నా వెంటరండి. లోకల్ట్రైన్ పట్టాలదగ్గరికెళ్ళి చూద్దాము" కళ్ళుతుడుచుకుంటూ కనకవల్లి బయలుదేరింది-రైలుకింద పడ్డాడేమో నన్న అనుమానంతో.

జయరాజ్ ఇంటినుంచి బయలుదేరి పోలీసుస్టేషన్కివెళ్ళి రిపోర్టు చేశాడు ఫోటోఇచ్చి.

"పరీక్షా ఫలితాలు తెలిసినరోజున ఇలాంటి రిపోర్టు లెన్నోవస్తాయి. మా ప్రయత్నం మేముచేస్తాము. మీరు రేపువచ్చి కనుక్కోండి"అన్నాడు యస్సై.

అరమైలుదూరం నడిచివెళ్ళి తిరిగి యింటికి వచ్చాడు జయరాజ్. రైలుకట్ట దగ్గరికి వెళ్ళిన కనకవల్లీ నౌకర్లు తిరిగివచ్చారు.

కనకవల్లి ఏడుస్తూ జయరాజ్వల్లనే వెంకటేశ్వర్లు ఏదో అఘాయిత్యం తల పెట్టాడనుకుని చాపమీద ఒరిగిపోయింది. తల్లిదండ్రీ వెదకటానికి బయలుదేరి నప్పటినుంచీ లీలకు నిజంగా భయంపుట్టి అన్నంతినకుండా సోఫామీద కూర్చుంది. పదిగంటలవరకూచూసి అక్కడే నిద్రపోయింది.

జయరాజ్కి నేలమీద కాలు ఆనటంలేదు. సమయానికి ఇంట్లో టెలిఫోను చెడిపోయింది. మళ్ళీ కాళ్ళకు చెప్పులు వేసుకుని పబ్లిక్ టెలిఫోనుబూత్కి వెళ్ళి ఆ ఊరిలోని పోలీసుస్టేషన్లన్నిటికీ ఫోనుచేసి వెంకటేశ్వర్లు ఎత్తు లావు, రంగు, పోలికలన్నీచెప్పి పరీక్షా ఫలితాలు తెలిసినప్పటినుంచీ కనబడటంలేదని రిపోర్టు చేశాడు. జయరాజ్ కొడుకునుగురించి ఆలోచించుకుంటూ తనన్నమాటలకు పశ్చాత్తాపంచెందుతూ మెల్లగానడిచి ఇంటికివచ్చేసరికి రాత్రి పన్నెండు దాటింది.

అమ్మాయి సోఫాలో అస్తవ్యస్తంగా పడుకుని నిద్రపోతున్నది. భార్య గదిలో నేలమీద పడుకునే ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది.

అటువంటి సమయంలో జయరాజ్‌కి తన కుటుంబ చరిత్ర జ్ఞాపకం వచ్చింది. తన ముత్తాత రామచంద్రయ్య ఉన్నట్టుండి కనబడకుండా పోయేవాడట ఆ కాలంలో ఇద్దరు ముగ్గురు మనుష్యులను పెట్టి ఆయన తండ్రి వెతికించే వాడట. వాళ్లు బంధువుల ఇళ్ళకు వెళ్లి ఒకరోజు ఉండి వాళ్ళ యింట్లో భోజనం చేసి, మళ్ళీ బయలుదేరి ఇంకొక ఊరు అలా అందరిళ్ళకూ వెళ్ళి లేడనిపించుకుని ఏ రెండు నెలలకో తిరిగి వచ్చే వారట, ఈ లోపల జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఏడుపులూ ఎవరిమీదనో కోపం వచ్చి ఇంట్లో నుంచి వెళ్ళిపోయినాడని అందరూ అనుకోవటం, ఇంట్లో ఒకరినొకరు 'నీ వల్లనే అంటే నీ వల్లనే' అని నిందారోపణలు చేసుకుంటూ తిట్టుకుంటూ ఏ సాయంత్రానికో శాంతించి ఎక్కడి వాళ్ళక్కడే చాపలమీద నిద్రపోయేవారు. ఇలా అయిదారు నెలలు తిరిగి చేతిలో ఉన్న డబ్బు అయి పోయిన తరువాత ఇంటికి వచ్చేవాడట. ఆయన చేసిన పనులను విమర్శించ కుండా ప్రశ్నలూ వేయకుండా అందరూ మామూలుగా ఉంటే ఐదారు నెలలు ఉండే వాడట. అందరూ ఆయనను వింతగా చూసేవారట, ఆప్యాయతతో మాట్లాడటం మానివేసి పరాయివాడిని చూసినట్టు చూసేవారట చివరిసారిగా వెళ్లి మళ్ళీ రానేలేదట.

ఆయన పోలికగాని వీడికి రాలేదు కదా?

రామచంద్రయ్యగారి కొడుకు వెంకటేశ్వర్లు ఇంటి పనులన్నీ తనమీద వేసుకుని ఇంటిపనే కాక బయట పనులన్నీ చేసేవాడట. ఆయన చదువు కొని ఆ చుట్టుపక్కల వాళ్ళకు స్టాంపుకాగితాల మీద డబ్బు తీసుకుని రాసి పెట్టేవాడు, బయట ఊళ్ళనుంచికూడా వస్తూఉండే వారుట. ఆయన అలా రాసిపెట్టి మనిషికి ఐదేసి రూపాయలు తీసుకునే వాడట. రైతులతో పొలాలకు వెళ్ళి వాళ్ళతోపాటు పనిచేసి వచ్చే ఆదాయంమీద మళ్ళీ భూమి కొంటూ ఉండే వాడు. ఆయన పుట్టుకతో వకీలు ప్రజలమధ్య తగాదాలను ఒకనిమిషంలో విడగొట్టి వాళ్ళను సంతోషంతో ఇళ్ళకు పంపేవాడు ఆ ఊరికి ఆయన న్యాయమూర్తిగా వెలుగొందాడు. పెద్ద మేడ కట్టాడు. పాడి పంట-సిరిసంపద ఆయింట చెట్టా పట్టాలేసుకుని సఖ్యంగా ఉండేది.

ఆయన తెల్ల వారకముందే చెట్లకు నీళ్ళుపోసి స్నానంచేసి గ్లాసెడు

అపుపాలు తాగి తెల్లటి ధోవతి కుడతా లేసుకుని బైటికి వస్తుంటే ఆ తెల్లటి భారి విగ్రహానికి కనబడిన వాళ్ళల్లా 'అయ్యగారూ దణ్ణాలు' అనేవారు.

ఆయన ఆ వంశానికి ఆణిముత్యం.

అటువంటి వెంకటేశ్వర్లగారి పేరు తనకొడుక్కు ఎటువంటి మార్పులు లేకుండా పెట్టాడు జయరాజ్.

"ఇదేం పేరు ? పాతపేరు" అన్నది తల్లి.

"పేరు పాతదయితేనేం ? ఆయన పోలికవస్తే పేరుతోపాటు మనిషి కూడా ధన్యుడవుతాడు."

ఊళ్ళో వాళ్ళు "తను జయరాజ్ అని నాగరీకమైన పేరుపెట్టుకున్నాడు. కొడుక్కి వెంకటేశ్వర్లు అని పాత పేరు పెట్టాడు. ఏమయినా బాగుందా ?" అనుకున్నారు. కొందరడగనే అడిగారు.

"పేరు కాదండీ ముఖ్యం. గుణం కావాలి" అని సమాధానమిచ్చేవాడు. ఆయనదీ పెద్దలపేరే. ఆయన బామ్మగారి పేరు రాజరాజేశ్వరి.

కాలం మారింది కనుక వెంకటేశ్వర్లుగారు చేసిన పనులు ఇప్పుడు ఈ వెంకటేశ్వర్లు చేయనవసరం లేకపోయింది. ఆ వెంకటేశ్వర్లు గారికి ఎక్కడ చూసినా ఎప్పుడుచూసినా పనులే కనబడేవి. ఈ వెంకటేశ్వర్లకు చేయవలసిన పనులు కూడా కనబడవు కంటికి.

"ఎంత వైరుధ్యం ఇద్దరి స్వభావాలలో ?" అనుకునేవాడు జయరాజ్.

అయినా పేరుపెట్టినంత మాత్రాన ఆ స్వభావం వస్తుందా ? వస్తుందనుకుని భ్రమపడ్డాడు.

వెంకటేశ్వర్ల జేబులో ఐదువందలున్నాయి. సెలవుల్లో నీకిష్టమయిన బట్టలు కుట్టించుకోమని తల్లి ఇచ్చింది.

"ఇంటరయింతరువాత పెద్ద చదువు చదివి నీవు గొప్ప ఉద్యోగం చెయ్యాలిరా. పొలంపనులు నీవేంచేస్తావు ?" కొడుకును ప్రోత్సహించేది తల్లి. అతడికి ఆమెచెప్పిన మొదటిమాట రెండవమాటకంటె ఎక్కువగా పనిచెయ్యటం

మొదలు పెట్టింది. అందుకు చేయవలసినది ముందుగా బట్టలు కుట్టించుకోవటం. కొత్తబట్టలతో పెట్టె నిండుగా సర్దినట్టుండేది.

పత్రికను ఆనాడు తండ్రిముందు చూశాడు. చెల్లెలు తరువాత చూసింది. తండ్రిచూసిన వెంటనే "ఇవిగో నీ పరీక్ష ఫలితాలు" అంటూ పేపరు వెంకటేశ్వర్లు మీద పడేశాడు.

వెంకటేశ్వర్లు అప్పటికి కాఫీ తాగాడు. స్నానంచేసి కొత్తపాంటు షర్టు వేసుకున్నాడు. బయటికి వెళ్ళాలనుకుని బూట్లు బాగా మెరిసేటట్టు పాలిష్ చేసుకుని వేసుకున్నాడు.

ఇంతలోకి పిడుగులాంటి వార్త.

తల్లీదండ్రీ వాదించుకుంటున్నారు అతడి చదువును గురించి. చటుక్కున తనగదిలోకి వెళ్ళి సూట్‌కేసు చేతబట్టుకుని పెరటిదారిన పెద్దపెద్ద అడుగులు వేసుకుంటూ వెళ్ళాడు. రైల్వేస్టేషన్‌కి.

అతడికి పరీక్ష రాయకముందునుంచీ మదరాసు వెళ్ళాలన్న ప్లానుంది. బట్టలు కుట్టించుకునేటప్పుడు కొంతడబ్బు మిగుల్చుకున్నాడు. తల్లి బీరువా తాఃపు చెవులు దానికే తగిలించి ఉంటాయి. ఎరువులకోసం తండ్రి యిచ్చిన డబ్బు బీరువా తెరవగానే కనబడ్డది. వాటినందుకుని పాంటు జేబులో కుక్కుకుని వెళ్ళాడు.

మదరాసు చేరుకుని హోటల్లో దిగాడు. భోజనం చేసి నాలుగు బజార్లు తిరిగాడు.

మాంబళంలో ఇళ్లు కొంచెం చౌకగా దొరుకుతాయన్న ప్రతీతి ఉంది. అక్కడ ఒకగది తీసుకుని ఉన్నాడు.

ఏంచెయ్యాలన్న ఆలోచన నిజంగా అప్పుడు కలిగింది. ఎన్ని రకాల ఆలోచనలో చేశాడు. సినిమాలల్లో చేరిపోదామా అంటే శిక్షణయిచ్చి నటుడిగా తయారుచేద్దామని ఇప్పుడు ఏ ప్రొడ్యుసరు అనుకోవటంలేదు శిక్షణపొందినవాళ్లకు సూచనలిచ్చి వాళ్ళతో ప్రయోగాలు చేస్తారు. వాళ్ళ దర్శనకోసం ప్రతిరోజూ వెళ్లి పడిగాపులు పడితే కార్లో బైటికివెళ్తూ కనబడతారు. దానికి ఎన్ని సంవత్సరాలు తిరగాలో?

ఒకచిన్న కొట్టుపెట్టి వ్యాపారం-సిగరెట్లు అగ్గిపెట్టెలు చాకొలెట్లతో పెడదామనుకున్నాడు. రోజుకు ఎంత వస్తుందని?

ఆ ప్లాను నచ్చలేదు.

అతడి గది పక్కనున్న ఇంట్లో ఒక ముసలామె ఉన్నది. ఆమెకు కొడుకులూ మనమలూ ఇంటినిండా జనమున్నారు. కాని ఆమె కళ్ళజోడు ఫ్రేమును బాగుచేయించి తెచ్చేవాళ్ళు కనబడలేదు. ప్రతిరోజూ అందరినీ అడుగుతుండేది.

"ఈ అద్దాలు లేకపోతేనేం? నీవు ఇప్పుడు చదువుకోవాలా? బట్టలు కుట్టరా!" అని అడిగేవారు. జేబులో పెట్టుకునివెళ్ళి "ఇవాళ మర్చిపోయాను. రేపు తప్పకుండా చేద్దామని నా దగ్గరే ఉంచుకున్నాను'' అని ఒకరు, ఆమె ఇచ్చిన డబ్బు ఖర్చుపెట్టుకుని "డబ్బు చాలలేదు. కళ్ళజోడు షాపులో ఇచ్చివచ్చాను. ఒకవైపు కాడ పనికిరాదన్నాడు. కొత్తది వెయ్యాలంటే పదిహేను రూపాయలవుతుందన్నాడు" అని ఒకరూ, నెలరోజులనుంచీ ఆమె కళ్ళజోడు రిపేరు చేయించటానికి ఇలా అందరూ ఆమెను బాధపెట్టున్నారు.

ఒకనాడు వెంకటేశ్వర్లు బైటికి వెళ్ళుతుండగా "మీరెవరూ బాగుచేయించ వద్దుగాని నాది నాకివ్వండి" అని బలవంతంగా వాళ్ళదగ్గర్నుంచి తీసుకుని ఒడిలో పెట్టుకుని పెరటిగుమ్మంలో కూర్చుని ఆలోచిస్తున్నది ఆ పెద్ద మనిషి.

వయసు ఎన్ని మార్పులు తెస్తుంది మనిషిలో? ఒకప్పుడు తనకు కావలసినవి ట్రామ్ ఎక్కి బస్సులోనేవెళ్ళి తెచ్చుకునేది. ఈ కళ్ళజోడు డాక్టరు దగ్గరికి తెళ్ళి తనే తెచ్చుకున్నది. తనకవసరమైన బట్టలు మందులు కొనుక్కునేది. ఇప్పుడందరిమీద ఆధారపడాల్సివచ్చింది. డబ్బు జేబులో వేసుకున్నవాడు తప్పించుకుని తిరుగుతాడు.

ఏమిటీ వయసుతెచ్చిన మార్పు?

అవసరం!

''నాతోటి ఎవరికి అవసరం ఉందిప్పుడు? ఒకప్పుడు నాతో ఇంట్లో అందరికీ పనుండేది. అందరి అవసరాల కోసమూ తను తిరిగేది.

ఆమె తనలోతనే గుణుక్కుంటున్నది. వెంకటేశ్వర్లు విన్నాడు ఆ మాటలు.

"పెద్దమ్మా. మీకేంకావాలి ? ఒక్కరూ కూర్చుని బాధపడుతున్నట్టున్నారు?" మోకాళ్ళమీద చేతులుపెట్టుకుని, ఒంగి అడిగాడు.

"నా కళ్ళజోడు నాయనా. రెండు నెలలయింది ఒకపక్క కాడ విరిగి పోయింది. ఇంట్లో పిల్లలున్నారు. ఒక్కళ్ళూ వినిపించుకోవటం లేదు. కళ్ళజోడు లేకపోతే నాకు సరిగా కనబడదు." అంది.

''నేను మీ పక్కఇంట్లో గదిలో ఉంటాను. మీకేపనికావలసివచ్చినా నాతో చెప్పండి. నేను చేస్తాను" అని ఆమె యిచ్చిన కళ్ళజోడూ డబ్బు తీసుకున్నాడు. కళ్ళజోడు కేసులో అదెక్కడ కొన్నదీ ఒక కాగితం కనబడ్డది. దానినాధారం చేసుకుని బస్సులో షాపు వెతుక్కుంటూ వెళ్ళి, దగ్గరకూర్చుని బాగుచేయించుకుని మధ్యాహ్నానికల్లా తెచ్చి ఆమె చేతిలో పెట్టాడు.

ఆమె కళ్ళజోడు బట్టతో తుడుచుకుని పెట్టుకుని "ఎన్ని నెలలయిందో కళ్ళకు జోడులేక ?'' అనుకుంది.

"అబ్బాయీ, నీవేంచేస్తున్నావిక్కడ ? మా యింట్లో ఇంతమందికి చెప్పాను. పని కాలేదు. నీవు అనుకోగానే బాగుచేయించి తెచ్చావు. నీ ఋణం ఎట్లా తీర్చు కోను చెప్పు ?" అన్నది కృతజ్ఞతా భావంతో.

''నేను చదువుకునేవాడిని. కాని డబ్బులేదు. నేను పని చెయ్యాలంటే ఏ పని దొరుకుతుందా అని చూస్తున్నాను. నేను వచ్చి నెల అయింది" అన్నాడు.

"నీవు సాయంత్రం ఒకసారి కనబడు. నీవు నేను చెప్పగానే వెళ్ళి నా పని చేసిపెట్టావు. నా మనుమలకంటె నీవే మంచివాడివనిపిస్తోంది నాకు. ఈ పది రూపాయలు దగ్గరుంచుకో" అని చేతిలోపెట్టింది.

సాయంత్రం ఐదుగంటలకు మంచిబట్టలు వేసుకుని తళతళలాడే బూట్లు వేసుకుని ఆమె దగ్గరికి వెళ్ళాడు. ఆ సమయంలో ఆమె తన కొడుకుతో మాట్లాడు తున్నది.

"నాయనా, ఇతడే నేను చెప్పిన అబ్బాయి. చాలా బుద్ధిమంతుడు. చదువు కున్నవాడు. పై చదువులకని వచ్చాడట ఇక్కడికి'' అన్నది.

ఆయన అతడిని కిందినుంచి పైవరకూ చూశాడు. గొప్పింటి పిల్లవాడని తోచింది. తనకు మందుల షాపులో చేతికింద కొంచెం చదువువచ్చిన పిల్లలు కావాలి. ఉన్నవాళ్ళు నాటుసరుకు. ఇతడు తన షాపులో ఉంటే వ్యాపారం బాగా సాగుతుందనిపించింది.

"నా మందుల షాపులో పనిచేస్తావా? ఎంత చదువుకున్నా, ఏం ఉద్యోగాలు దొరుకుతున్నాయి ఈ రోజుల్లో? కొన్నిరోజులు చేసిచూడు. నీకు నచ్చితే ఉండిపో. నీ పనిని చూసినేను జీతం పెంచుతూ ఉంటాను" అన్నాడు.

ఆ రోజునుంచీ వెంకటేశ్వర్లు ఇంటిపేరు కలుపుకుని పి.వి.రావుగా ఆ షాపులో ప్రవేశించాడు. ఇతడి డ్రెస్సునూ, మాటనుచూసి అక్కడ పనిచేసేవాళ్ళు భయపడుతూ ఒదిగిఒదిగి పని చెయ్యటం మొదలుపెట్టారు. షాపులో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు తీసివేస్తూ ఎవరు ఏ మందు అడిగినా అతడికి చీటీతెచ్చి చూపించేవారు అతడు ఎక్కడ ఉన్నదీ చెప్పి తెప్పించి ఎక్స్ట్రా టాక్సు కూడా కలిపి ధర చెప్పేవాడు. డబ్బు తీసుకుని, డ్రాయరులో వేసి అక్కడే కుర్చీలో కూర్చునేవాడు. అమ్మిన సరుకు లెక్కరాసి ఇంటికి వచ్చేటప్పుడు డబ్బుతెచ్చి యజమానికిచ్చేవాడు.

యజమాని నారాయణన్ కొడుకులూ మనమలూ ఆయన చెప్పినట్లు వినేవారు ఎవరూలేరు. కొందరు ఉద్యోగాలూ కొందరు చదువులూను. వీళ్ళల్లో ఎవరిని వారం రోజులు షాపులో కూర్చోబెట్టినా డబ్బు యింటికి రాదు.

"నీపని నాకునచ్చింది. నేను కూడా అప్పుడప్పుడు షాపుకువస్తూ ఉంటాను. నీవు షాపును బాగానడుపుతూ ఉండు. నీకు వాళ్ళయింట్లో ఆ చిన్నగదిలో ఉండటం కష్టంగా ఉన్నదనుకుంటాను. మా యింట్లో నీకోగది ఏర్పాటు చేస్తాను. నీవు హోటల్లో భోజనంచేయకు. మాదగ్గరే మా పిల్లలతో భోజనంచెయ్యి. నీవు గొప్పింటి పిల్లవాడివి. మా షాపులో పనిచేస్తాననటమే నాకు ఘనంగా ఉంది. భిడియపడకు" అని చాలా గౌరవంతో మాట్లాడేడు.

తనమీద అంత సదభిప్రాయం ఆయనకు కలిగినందుకు వెంకటేశ్వర్లకు చాలా సంతోషం కలిగింది. ఆయన ఎంతగౌరవంగా తనతో మాట్లాడేడు? ఆయన

తనకిచ్చిన గౌరవానికి తగిన అర్హత తను సంపాదించుకోవాలి. తను కృషిచెయ్యాలి? ఆయన దృష్టిలో గొప్పవాడిగా నిలిచిపోవాలి.

తను ఉపాయంతో పైకి రాగలడేమోగాని అర్హతలతో రాగలడా? ఆ రాత్రంగా బాగా ఆలోచించాడు. కొంతకాలము ఈ విధంగా నడవనియ్యమనుకున్నాడు. తనకు గది ఖర్చులేదు. భోజనం ఖర్చులేదు. షాపులో ఉన్నందుకు ఆయన జీతం ఏర్పాటు చేస్తానంటున్నాడు.

స్వంత ఊళ్ళో వెంకటేశ్వర్ల పేరు మాసిపోయింది ఇక్కడ మంచి డ్రెస్సులేసుకుని ఠీవిగా షాపులో కూర్చునే పి.వి.రావు పట్ల కొనుగోలుదార్లకు కూడా మంచి గౌరవం కలిగింది. దానికితోడు అతడు ఇప్పుడు ఇంగ్లీషు బాగా మాట్లాడటం అలవాటు చేసుకుంటున్నాడు.

ఆ భాషమీద గౌరవం దినదినానికి అధికమవుతున్నది గాని తరగటం లేదు మనదేశంలో స్టైల్ అంటే అదీ.

సహజంగా చురుకుదనం గల పి వి.రావు ఆంగ్లభాషను అనర్గళంగా మాట్లాడుతున్నాడు. ఇప్పుడు కొనుగోలుదారు లెవ్వరూ దబాయించటంలేదు. అతడు చెప్పిన ధరను గురించి ప్రశ్నించటంలేదు.

యజమాని తల్లి ప్రతి పండగకూ "నాయనా. కొత్తబట్టలు కుట్టించుకొమ్మ"ని డబ్బిస్తుంది. ఉదయం ఆరుగంటలకే గ్లాసుతో కాఫీ గదిలోకే వస్తుంది. తనగది పక్కనఉన్న నీళ్ళగదిలోకి బకెట్ తో వేడినీళ్ళు వస్తాయి. స్నానంచేసి డ్రెస్సువేసుకుని కూర్చుంటాడు. టిఫిన్ వేళకు టిఫిన్ వస్తుంది

ఈ వారం రోజులనుంచీ పెద్దకొడుకు ఆఫీసుకు వెళ్ళేటప్పుడు తనకారులో షాపుదగ్గర దింపుతున్నాడు. దీనితో అతడికి ఆ ప్రాంతం షాపుల్లో గౌరవం మరింత పెరిగింది. కొద్ది రోజులలోనే అతడు ఆ షాపుకు మేనేజరయ్యాడు.

అతడు ఒకసారి ఇంటరు తప్పినవాడు కనుక కొద్ది శ్రమతో మళ్ళీ పరీక్షకు కూర్చుందామనిపించింది. రాత్రిళ్ళు శ్రమించాడు. పరీక్షరాశాడు. దానిలో నెగ్గిన సంతోషంతో అన్నామలై యూనివర్శిటీ బి.ఏ. పరీక్ష కరెస్పాండెన్సు కోర్సు రాత్రిళ్లు చదివి పరీక్షరాశాడు. అలాగే ఎం.ఏ కూడా అయ్యాడు.

ఎవరికీ చెప్పలేదు. కాని-ఆదిత్య మెడికల్‌స్టోర్సు మేనేజరు ఏం.ఏ. అని విజిటింగ్‌కార్డు అచ్చు వేయించుకున్నాడు.

ఆ యింటి యజమానురాలు వయసులో పెద్దదయినా అన్నీ ఆమెచెప్పి నట్టే ఇంతవరకూ ఆ సంసారం నడిచిపోతున్నది. ఆమె తండ్రికి ఆమె ఒక్కతే సంతానం. ఆ మేడ ఆమెతండ్రి యిచ్చినదే. పెద్దరోడ్డుమీద ఉన్న కొట్లుకూడా ఆమెవే. ఆమె మంచి వ్యవహారదక్షత తండ్రిదగ్గరే నేర్చుకుంది. ఆ అద్దెలు వసూలుచేసుకునే పక్కవీధిలో ఒక చిన్నఇల్లు అమ్మకానికి రాగానే కొని బాగు చేయించి బాడుగకు ఇచ్చింది. కొడుకు ఒక ఆఫీసులో అసిస్టెంటు డైరక్టరుగా పనిచేస్తున్నాడు. అతడి ముగ్గురి కొడుకుల్లో ఇద్దరు ఏవో కంపెనీలలో పనిచేస్తు న్నారు. మూడవవాడు చదువుతున్నాడు. ఒక ఆడపిల్ల చిన్నది. కోడలు ఇంటి పని చూసుకునేది. అందరికీ కాఫీ టిఫిన్లు వంట చెయ్యటానికి ఒక అరవామెను పెట్టుకున్నారు.

ఆమెను అందరూ జానకమ్మా అని పిలిచేవారు. ఆమె వీళ్ళయింట్లోనే ఉండి తెల్లవారి ఐదుగంటలకే లేచి స్నానంచేసి పెద్ద యజమానురాలైన అంబు జమ్మ గారికి కాఫీచేసి యిచ్చేది. అందరూ లేచేలోపల టిఫిన్ కూడా తయారు చేసేది.

పి.వి.రావని పిలవబడే వెంకటేశ్వర్లు కూడా వాళ్ళులేచినప్పుడే లేచేవాడు. పరీక్షలప్పుడు చదువుకునేవాడు. మామూలు రోజులలో బిజినెస్‌ను గురించి పుస్త కాలు చదివేవాడు.

రెండువందల రూపాయలతో ప్రారంభమయిన జీతం ఇప్పుడు పి.వి. రావుకు క్రమంగా ఐదువందలయింది. చిల్లరఖర్చులకు ఉంచుకుని మిగిలిన డబ్బు పక్కవీధిలో ఉన్న బ్యాంక్‌లో ఎక్కౌంటు పెట్టుకున్నాడు.

ఒకనాడు యజమానితో చెప్పాడు-"నిరాశ్రయుడిగా ఉన్ననాకు ఆశ్రయం ఇవ్వటమే కాదు ఉద్యోగమిచ్చి ఇంట్లోనే లాడ్జింగ్ బోర్డింగు వసతులు కల్పించారు. నేను మీకు ఎంతో ఋణపడి ఉన్నాను. ఇక్కడ చాలా సుఖంగాఉన్నాను. మీ అమ్మగారితో ఉదయపువేళల్లో పదినిమిషాలు మాట్లాడినా నాకు కొండంత ధైర్యం వచ్చినట్టుంటుంది. ఆ ధైర్యంతోనే నేను రాత్రిళ్ళు కరెస్పాండెన్సు కోర్సు చదివి ఎం.ఏ. అయ్యాను. బిజినెస్ పుస్తకాలు తెప్పించుకుని చదువుతున్నాను. బిజినెస్

మేనేజిమెంటని ఒకకోర్సు ఉంది. అది చదివితే ఈ మందులషాపునే పెద్దది చేయవచ్చు, లేదా మరొక షాపు తెరవవచ్చు. మనము ఈ చిన్నషాపుతో కాకుండా వ్యాపారాన్ని మరొక విధంగాకూడా వృద్ధిచేసుకోవచ్చు. మీ మూడవ అబ్బాయికి రెండు మూడేళ్ల మెడికల్‌షాపు ఒప్పగించి నేనాపరీక్ష చదువుతాను. ఇక్కడ చదివినదానికంటె విదేశాలలో చదివితే బాగుంటుంది. అక్కడి సూత్రాలు ఇక్కడివీ కలుపుకుని మనం వ్యాపారాన్ని బాగా వృద్ధిలోకి తీసుకురావచ్చు. మీ అభిప్రాయం చెప్పండి" అన్నాడు.

ఇంటి యజమాని పేరు నారాయణన్, రెండుతరాల క్రిందట మదరాసులో మాంబళంలో కాపరం పెట్టేరు. తెలుగువాళ్లయినా అరవయాస అలవడింది. ఆయనను అందరూ నారాయణన్ అంటారు.

నారాయణన్ ఆలోచనలో పడ్డాడు. "నీవు చెప్పిన మాటలు చూస్తే నాకు నోరు ఊరిపోతున్నది. విదేశాలంటున్నావు. డబ్బు బాగా వేలుఖర్చవుతుంది కదా. నేను పిల్లలు గలవాడిని అంతఖర్చు భరించగలనా అని చూస్తున్నాను" అన్నాడు.

కొంతసేపు ఆలోచించి ఆయనే మళ్ళీ అన్నాడు "చూడు బాబూ, నాదొక సలహా. నీవు స్వతంత్రంగా ప్రైవేటుగా చదివి రెండు డిగ్రీలు సంపాదించావు. నీవు చెప్పిన బిజినెస్ మేనేజ్‌మెంటు ఎడ్మినిస్ట్రేషన్ కోర్సు ఇక్కడ కూడా ఉన్నాయి. సాయంత్రపు కళాశాల అది."

"దానికి నేను ఎట్లావెళ్లగలవండీ. షాపులో కస్టమర్సు ఎక్కువగా వచ్చే సమయమదే"

"ఆ మాటకే వస్తున్నా. నాకు ఆ కాలేజి ప్రిన్సిపల్ తెలుసు. నేను స్వయంగావెళ్ళి చెప్తాను. కాలేజిలో చేరు. ఫీజుకట్టు-అటెండెన్సు వేయించుకో. కొంచెంసేపు కూర్చుని వచ్చెయ్యి. నీవు పుస్తకాలు తెచ్చుకుని ఇదివరకే చదువుతున్నావు. ఈ కోర్సు ఇక్కడే చదువు. పరీక్ష ప్యాసయిన తరువాత నాలుగయిదు నెలలు అక్కడికివెళ్ళి వ్యాపారంలోని ఆధునిక మెలకువలు నేర్చుకో. ఇక్కడికి వచ్చి వ్యాపారంలోని ఆధునిక మెలకువలు నేర్చుకో. ఇక్కడికివచ్చి వ్యాపారాభివృద్ధి ఏ రూపంలో చేస్తే బాగుంటుందో ఆలోచించు." అన్నాడు నారాయణన్.

ఆ సలహా కూడా బాగానే ఉన్నట్టనిపించింది. సీటు అక్కడ దొరక్క

పోయినా ఇక్కడ దొరకటం ఖాయం. ఆయనే ఇప్పిస్తానంటున్నారు. భారం ఆయన వహిస్తానంటుండగా తన ప్రయత్నాలెందుకనుకున్నాడు.

ఆ మరునాడు ఉదయమే లేచి, కాఫీతాగి తీరిగ్గా కూర్చున్న అంబుజమ్మతో ఈ సంగతి చెప్పాడు.

"మీరు నన్ను మొదట ఆదరించి "మా యింటికి రమ్మ"ని పిలిచారు. ఆ వేళ ఎటువంటిదో నేను మీలో ఒకడినై పోయాను. మీ అండదండలతోనే నేను బి.ఏ; ఎం.ఏ కూడా చదివి పాసయ్యాను. నేను ఈ ఎం.బి.ఏ. కూడా చదివి మీ వ్యాపారాన్ని పదింతలుగా అభివృద్ధిలోకి తెస్తాను. ఇది చదివిన తరువాత ఒక్క సారి విదేశాలకు వెళ్ళి వ్యాపారంలోని కొత్తకొత్త మెలకువలు తెలుసుకుని రావాల నుంది. ఇదికూడా మన వ్యాపారాన్ని వృద్ధిచేయకలిగిందే" ఆమెకు పాదాభి వందనం చేశాడు.

"నాయనా, నీ పాదం మంచిది నీవు మా యింట్లో పాదం మోపగానే మందులషాపు వృద్ధిలోకి వచ్చింది. అది నేనే పెట్టించాను కొన్నినెలలు నేనే వెళ్ళి కొనుక్కునే దాన్ని. తరువాత నలుగురు వచ్చి ఆమందులు కొనుక్కునే వారు. నీవు వచ్చిన తరువాతనే అది నిజమయిన మందుల షాపయింది. ఆదాయం పెరిగింది. దానిలో లేని మందు ఇంకెక్కడా లేదన్నట్టుగా కష్టపడి తయారు చేశావు. అబ్బాయిని పిలిచి, నీకు కావలసిన సహాయం చెయ్యమని చెప్తాను. నీకేది కావలసినా నన్నడుగుతూ ఉండు, బిడియ పడకు" అన్నది.

ఆ సాయంత్రమే కొడుకును పిలిచి "ఈ అబ్బాయి ఏదో చదువుతా నంటున్నాడు. నీవు ఏర్పాటు చేస్తానన్నావట, వెంటనే చెయ్యి. అతడికి ఫీజు నేను ఇస్తానని చెప్పాను" అన్నది.

పి. వి. రావు నారాయణన్‌తో వెళ్ళి అప్లికేషన్ ఫారమ్ తెచ్చుకున్నాడు. పెద్దమ్మగారిచ్చిన ఫీజు కట్టి చేరాడు. బిజినెస్సి గురించి పుస్తకాలు బాగా చదివి వున్నాడు కనుక టెస్టులలో బాగా మార్కులు తెచ్చుకుంటున్నాడు. సంవత్సర పరీక్షలలో బాగా మార్కులు వస్తున్నాయి. రెండు మూడూ సంవత్సరాలు కూడా బాగా చదివి డిస్టింక్షన్‌లో ప్యాసయ్యాడు.

ఈ లోపల విదేశాలలో ఉన్న తన బావమరిదికి తనాక కంపెనీ మేనేజర్ని

పంపిస్తున్నాననీ అతడిని స్పాన్సరు చేయమని రాసేడు. ఆర్థిక సహాయ మవసరం లేదని వీసా కొరకు మాత్రమేనని రాసేడు.

ఆయన దగ్గర్నుంచి కాగితాలు రాగానే పి. వి. రావు వీసా తీసుకుని టికెట్ కొనుక్కున్నాడు. టికెట్ డబ్బుతోపాటు ఒకజత బట్టలు కుట్టించింది, అంబుజమ్మ. రావుకూడా తన దగ్గరున్న డబ్బుతో మరొకటి కుట్టించుకున్నాడు వెళ్ళేనాడు ఇంట్లో పెద్దలందరికి పాదాభివందనం చేశాడు. విమానాశ్రయానికి అందరు వచ్చి శుభాకాంక్ష లందించారు.

అమెరికాలో ఏస్టేటు కాస్టేటు పెద్ద బిజినెస్ సెంటర్‌గా ఉంటుంది. అతడు రోజుకొక షాపుకు వెళ్ళి ఆ యజమానులతో మాట్లాడుతూ ఉండేవాడు. చివరకొక షాపు యజమానితో తను వచ్చినపని చెప్పాడు. అతడు మిల్లునుంచి బట్టల తానులు తెప్పించుకుని బట్టలు కుట్టించి, తనకు పంపమనీ, ఆ విధంగా మిల్లు యజమానితోను, తనతోను వ్యాపారసంబంధాలు ఏర్పరచుకున్న తరువాత, దానికి అభివృద్ధిమార్గాలు ఆలోచించి ఉత్తరం రాస్తానని చెప్పాడు. మిల్లు యజమానులు పంపిన సరుకును డబ్బుకట్టి తీసుకున్నట్టే తనుకూడా అతడు పంపే సరుకును డబ్బుకట్టి తీసుకుంటానని మాటయిచ్చాడు. నమోనకు మిల్లు యజమాని దగ్గర ఒక తాను కొన్నాడురావు. దుస్తులు కుట్టించి షాపు యజమాని పేరు మీద పంపుతానన్నాడు. ఈ ఒప్పందం మీద ముగ్గురూ సంతకాలు చేశారు. సాక్షిగా నారాయణన్ బావమరిది చేశాడు.

పి. వి. రావు మదరాసు చేరగానే మందులషాపుకు దగ్గరగా రెండుషాపులు అద్దెకు తీసుకుని ఒకదానిలో టైలర్లను బట్టలుకుట్టడానికి ఏర్పాటు చేశాడు. రెండవదానిలో కుట్టుపని భద్రపరచటానికి తగిన ఏర్పాట్లు చేసి, నారాయణన్ మూడవ కొడుకును దానికి మేనేజర్ను చేశాడు. రెండునెలల కాలంలో మగవాళ్ళ షర్టులను కుట్టించి ఓడమీద బట్టలకొట్టు యజమానికి పంపించాడు. సరుకు చేరగానే ఆయన డబ్బుకట్టి తీసుకున్నాడు. ఆయన మళ్ళీ రెండుతానులు కొత్తనమోనాలు పంపమని మిల్లు యజమానికి రాశాడు. కొట్టు యజమాని షర్టనీ కుట్టించి పంపమని రాశాడు. ఈ వ్యాపారంలో ఖర్చులు పోను వెయ్యిడాలర్లు మిగులుతున్నాయి.

ఈ లోపల అంబుజమ్మ ఒక ఎత్తువేసింది. వ్యాపారాన్ని మాటలతో

కాకుండా డబ్బుతో వృద్ధిచేస్తున్న ఈ అబ్బాయికి తన మనవరాలు శ్రీలక్ష్మినిచ్చి వివాహంచేస్తే బాగుంటుందని కొడుకుతో ఆలోచన చేసింది.

"అతడికెవరూ లేనట్టున్నారు?"

"మనమందరంలేమా? లేనివాళ్ళు ఇవాళ ఎక్కడినుంచి వస్తారు? మనమే అన్ని చూసుకుని, ఖర్చుచేసి పెళ్ళి చెయ్యాలి. మనము ఎన్ని దేశాలు వెతికినా ఇంటువంటి అబ్బాయి దొరకడు. చూడటానికి బాగున్నాడు. చదువుకున్నాడు. మంచిమర్యాద మార్గాలు తెలిసినవాడు-మనలో ఇమిడిపోయినవాడు ఎక్కడ దొరుకుతాడు? నేను ఈ ఉద్దేశ్యంతోనే ఆ చిన్నయింటిని రిపేరు చేయించి రంగులు వేయించాను. ఆ అబ్బాయినే ఆధునిక వసతులు ఏర్పాటు చేయించమంటే చేయించాడు. తాళంవేసి ఉంచాను. అందరం ఒకసారి సరేననుకుంటే ముహూర్తం పెట్టించు" అన్నది.

నారాయణన్ కూడా ఆలోచించాడు. చదివినవాళ్లూ అందగాళ్లూ డబ్బుకల వాళ్ళూ దొరుకుతారు గాని ఇంటిలో కలిసిపోయి మర్యాదగా ఉంటూ వ్యాపారాభి వృద్ధిని చేసేవాడు దొరకటం కష్టం. అసలన్నిటికీ ముఖ్యకారణం తల్లికి బాగా నచ్చాడు. ఆమె ఎంత డబ్బయినా అతడిక్రింద ఖర్చుచేస్తుంది. తన నగలూ ఇల్లూ ఇస్తానంటోంది. పెళ్ళి తను చేస్తాడు.

కావలసిందేముంది? అదృష్టదేవత అతడిలో తన ఇంట్లో పాదం పెట్టింది.

అందరూ సరే సరే అంటే సరే నన్నారు ఒక సుముహూర్తాన వైభవంగా పెళ్ళి జరిగిపోయింది అమ్మాయి శ్రీలక్ష్మి బామ్మచాటు పిల్లయినా పి వి. రావుకు స్వయంగా కాఫీ యిస్తూ అతడి అవసరాలను కనుక్కునే అమ్మాయే కొంచెం చిలిపి. ఒకనాడు చల్లటి కాఫీ తెచ్చేది. ఇదేమిటంటే మరునాడు నోరు కాలిపోయే టంత వేడి కాఫీ తెచ్చియిచ్చేది. చిలిపి జగడాలు నడుస్తూఉంటే బామ్మగారు సర్దుతూ ఉండేది.

పెళ్ళికాగానే కొత్తయింట్లో కాపరం పెట్టారు.

అప్పుడు పి. వి. రావుకు తల్లిదండ్రులను చూడాలనిపించి నారాయణన్‌తో అంబుజమ్మతో చెప్పాడు.

"నిజమా? నీకు అమ్మా నాన్నా ఉన్నారా?" ఆశ్చర్యంతో అడిగారు అంబుజమ్మతో సహా.

"ఉన్నారండి. మానాన్నకు పాతిక ఎకరాల సుక్షేత్రమైన మాగాణి భూమి ఉన్నది. అరటి తోటలూ కొబ్బరి తోటలూ ఉన్నాయి కొత్తగా ద్రాక్ష వేశారు రెండు ఎకరాలలో. ఆ ఊళ్లో ఒక పెద్దమేడ ఉంది. నాకొక చెల్లెలు కూడా ఉంది. నేనొక్కడినే కొడుకు"ని చెప్పాడు.

చిన్న విషయంలో తండ్రికీ తనకూ తగాదా వచ్చి అక్కడి నుంచి వచ్చేశానన్నాడు.

"ఇప్పుడు పెళ్ళి అయింది కనుక వాళ్ళకు ఈ శ్రీలక్ష్మిని చూపించి మా చెల్లెలు పెళ్ళిచేశారో లేదో చూసి వారం ఉండి వస్తానన్నాడు.

అంబుజమ్మా నారాయణన్ ఆ మాటలకు పొంగిపోయి వియ్యపరాలికి వియ్యంకుడికి ఆడపడుచుకీ బట్టలిచ్చి పంపించారు.

రైలు దిగగానే ఇంటికి వెళ్ళకుండా కూలివాడిచేతికి తన కార్డు ఇచ్చి "వైటింగు రూములో ఉన్నారు. మీ కోసం ఎదురు చూస్తున్నారని చెప్పు'' అన్నాడు.

'పి. వి. రావు ఎం. ఏ; ఎం. బి. ఏ ఆదిత్య మెడికల్ స్టోర్స్ మేనేజర్. విదేశాలకు సరుకును ఎగుమతి దిగుమతుల వ్యాపారం చేసే బిజినెస్‌మన్ మద్రాసు' అని ఉన్న కార్డుచూసి భార్య దగ్గరికొచ్చి, ఎవరో ఒక గొప్పాయన వచ్చిస్టేషన్ నుంచి ఈ కార్డు పంపించి నన్ను రమ్మంటున్నాడు, వెళ్ళివస్తాను. మన వకీలుగారి కారులో వెళ్తాను. కాలినడకన వెళ్ళితే మర్యాదగా ఉండదు మన యింటికి వస్తే తీసుకు వస్తాను. నీవు కొంచెం కాఫీ టిఫిన్ చేయించు" అంటూ బీరువా తెరిచి తెల్లటి దోవతీ సిల్కు షర్టూ జరి ఉత్తరీయం వేసుకుని మెరిసే చెప్పులు వేసుకుని కారులో వెళ్ళాడు.

వైటింగ్ రూములో కూర్చుని కాఫీలు తాగారు. నూతన దంపతులు. స్నానాలు చేసి పెళ్ళి బట్టలు వేసుకున్నారు. ఆయన కోసం ఎదురుచూస్తూ తలుపుకు దగ్గరగా కూర్చున్నారు.

జయ రాజీని చూడగానే "రండి రండి లోపలికి" అని పిలిచి కుర్చీ చూపించాడు.

ఆయన కన్నార్పకుండా చూస్తున్నాడు.

వాళ్ళిద్దరూ లేచి ఆయనకు పాదాభివందనం చేసారు.

"నాన్నా, ఈమె నీ కోడలు శ్రీలక్ష్మి" అన్నాడు.

ఆయన దిగ్భ్రాంతుడై లేచి నిలబడి "ఓరే వెంకటేశ్వర్లూ, ఎక్కడున్నావురా ఇన్నాళ్లూ? ఎంత పెద్దవాడివైనావురా" అంటూ పుత్ర పరిష్వంగ సుఖాన్ననుభవించాడు.

"నాన్నా ఆ పేరు మరిచిపోయిన తరువాతనే నేను బాగుపడ్డాను. నా కార్డు చూశారా? నేను ఏం. ఏ; ఎం. బి. ఏ.ను తెలిసిందా? నేనిప్పుడు పి. పి. రావును,"

"ఒరే బాబూ! మా వేంకటేశ్వర్లుగారి పేరు పెట్టటం వల్లనే నీ వింతటి వాడివయ్యావు. నీదంతా ఆయన పోలికే."

"ఆ వెంకటేశ్వర్ల పేరు మళ్ళీ ఎత్తకండి నాన్నా?"

అందులోనుంచి వచ్చిందే గదరా పి. వి. రావు"

"నిజమే. కాని........"

పోనీలే. ఇంటికి వెళ్దాం. నీ కోసం కారు తీసుకువచ్చాను. ఎవరో ఎంత గొప్పవాళ్ళో వచ్చారని అమ్మ ఎదురుచూస్తూ ఉంటుంది. ఈ కోడల్ని చూసి మురిసిపోతుంది. నిన్ను తలుచుకుని ఎప్పుడూ కన్నీరు కారుస్తూ ఉంటుంది. పదండి, త్వరగా ఇంటికి వెళ్దాం" అంటూ తీసుకువెళ్ళాడు జయరాజ్.

నీల ఎదురుగా వచ్చి "అన్నయ్యా, ఈమె ఎవరూ?" అడిగింది.

"నీతో ఆడుకుంటుందని తీసుకొచ్చాను" అన్నాడు.

కనకవల్లి ఇద్దరినీ చూసి ఆనందంతో దగ్గరికి తీసుకుంది.

"ఒరేయ్ వెంకటేశ్వర్లూ నీలకు పెళ్ళి నిశ్చయమైంది నేనొక్కడిని అన్నీ

పనులూ చేయగలనా అని భయపడుతున్నాను. ఇప్పుడు నీవొచ్చావు. నాప్రాణం హాయిగా ఉంది.

"అమ్మా ఆ 'వెంకటేశ్వర్లు' అన్న మాటను మరిపించు నాన్నచేత. అప్పుడు గాని నేనే పనీ చేయ్యను" అన్నాడు బుంగమూతి పెట్టి.

❋❋